తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఎద్దు కోసం సెల్ టవర్ ఎక్కిన రైతు

రామకుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

ఎద్దు కోసం ఓ రైతు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానన్న సంఘటన సోమవారం రామకుప్పంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మణీంద్రం గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డి (58) వద్ద గత రెండేళ్లుగా ఉన్న ఎద్దు సంక్రాంతి పండగ సందర్భంగా తప్పిపోయింది. అప్పటినుంచి అతను ఎద్దుకోసం గాలించినా ఫలితం లేదు. ఆదివారం కెంపసముద్రం గ్రామంలో ఎద్ల పండగ నిర్వహించారు. అయితే గోవింద రాజపురంకు చెందిన వ్యక్తులు అదృశ్యమైన ఎద్దును పరుగెత్తించారు. ఎద్దును చూసిన ప్రసాదరెడ్డి తన ఎద్దు తప్పిపోయిన విషయం పెద్ద మనుషులకు తెలియజేశాడు. ఎంత చర్చించినా ఫలితం లేకపోగా సోమవారం ప్రసాదరెడ్డి రామకుప్పంలోని సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఫైర్ సిబ్బంది సాయంతో అతన్ని కిందకు దింపారు. ఈ అంశంగా విచారణ చేపట్టారు.

## వసంతపంచమితో కాణిపాకంలో భారీగా అక్షరాభ్యాసం



కాణిపాకంలో భారీగా జరిగిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో తమ పిల్లల చేత ఓనమాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు

# అంతా అయోమయం!

## -బలమున్నా ఓటింగ్‌కు రాని వైసిపి కార్పొరేటర్లు -కూటమినేతలు దాడిచేశారంటూ ఆగ్రహం



ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతినగరపాలకకౌన్సిల్‌లో రెండవ డిప్యూటీ మేయర్ ఎన్నిక లాంఛనమే అయినా వైసిపి కార్పొరేటర్ల వ్యవహార శైలితో అంతా అయోమయంగా మారింది. జిల్లా సంయుక్తకలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభంబన్సల్ నియమావళి ప్రకారం సోమవారం ఉదయం 11గంటల లోపు కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరుకావాలని శనివారమే ఉత్తర్వులు జారీచేశారు. అందుకు తగ్గట్లు ఎస్వీయూనివర్సిటీ సెనేట్‌హాల్‌లో అన్ని ఏర్పాట్లు, భద్రత చర్యలు తీసుకున్నారు. డిప్యూటీమేయర్ ఎన్నికకు ప్రత్యక్షపద్ధతిలో ఓటింగ్‌కు సిద్ధమయ్యారు. ఉదయం 11గంటలకు కేవలం 21మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరుకావడం విశేషం. మరోగంటసమయం వేచిచూసినా ఉన్న కార్పొరేటర్లు కొందరు బయటకు వచ్చేశారు. అప్పటికీ అక్కడ పూర్తిస్థాయిలో వైసిపి కార్పొరేటర్లు 27మంది హాజరుకాలేదు. వైసిపికి పూర్తిస్థాయి బలమున్నా కూటమినేతల పంచన 10మంది కార్పొరేటర్లు చేరడంతో అంతా గందరగోళంగా మారింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు విప్ జారీ చేయడంతో ఏం చేయాలనేది కార్పొరేటర్లలో ఆందోళన నెలకొంది. దీంతో మేయర్‌తోబాటు ఎంపి, ఎంఎల్‌సి, 22మంది కార్పొరేటర్లు సకాలంలో ఓటింగ్‌కు హాజరుకాలేదు. మరో 4కార్పొరేటర్లను కూటమి పార్టీల నేతలు కిడ్నాప్‌చేశారనేది వైసిపి ప్రధాన ఆరోపణ.

### -తొలినుండి వివాదమే:

తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో రెండోడిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలోగత వారంరోజులుగా వివాదం నెలకొంది. కార్పొరేషన్ కౌన్సిల్‌లో 47మంది బలమున్న వైసిపి కార్పొరేటర్లలో 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ పదవికి ఎంపిక చేశారు. ఆ పార్టీ ప్రకటించిన కొన్ని గంటల్లోనే అతని ఇంటిని నిబంధనలు విరుద్దంగా నిర్మిస్తున్నారని కూటమి నేతలు పడగొట్టేశారు. దీంతో ఆయన చేసేదిలేక ఏకంగా వైసిపి క్యాంపు నుండి ఇంటికి చేరుకుని పోటీ నుండి వైదొలిగారు. ఈ పరిస్థితుల్లో వైసిపిలో మరింత ఆందోళనకరంగా మారింది. ఆదివారం సాయంత్రానికి లడ్డుభాస్కర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. సోమవారం (నేడు) జరగాల్సిన ఎన్నికల్లో ఆయననే ఏకగ్రీవంగా గెలిపించుకోవాలని ఆ పార్టీ కార్పొరేటర్లతో సిద్ధమయ్యారు. ఉదయం పద్మావతిపురం నుండి కలసికట్టుగా వస్తున్న 23మంది కార్పొరేటర్లను,ఎంపి ప్రయాణించే బస్సును జనసేన కార్యకర్తలు అడ్డుకుని దాడికి దిగారు.దీంతో వైసిపిలో మరింత ఆందోళనకర పరిస్థితి ఎదురైంది. తిరుపతిలో భయభ్రాంతులకు గురిచేయడంపై మాజీ ఎంఎల్ఎ, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై దాడులకు దిగి బెదిరింపులకు పాల్పడ్డారని, పోలీసులు కూడా చూస్తూ ఉండటం మంచిదికాదన్నారు. ఇంత దారుణానికి దిగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల అదికారి కూటమికి అనుకూలంగా వ్యవహరించారని, కోరంలేక వాయిదావేయడం తీరు ఇదేనన్నారు.

### -హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్:

కోరంలేక డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదాపడటం, నలుగురు వైసిపి కార్పొరేటర్లను కూటమి జనసేన పార్టీ నేతలు కిడ్నాప్ చేయడంతో ఆ నలుగురు కార్పొరేటర్ల ఆచూకీపై హైకోర్టుకు వైసిపి చేరింది. హైకోర్టులో సోమవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది.ఎన్నికలను పూర్తిగావాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నామ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.అప్రజాస్వామికంగా వ్యవహరించడం దారుణమన్నారు.

## కలసినడవని వైసిపి కార్పొరేటర్లు !

### ఉత్కంఠ నడుమ కోరంలేక డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా
### నలుగురు కార్పొరేటర్లు కిడ్నాప్
### -నేడు ఏం జరుగుతుందో!?





తిరుపతికార్పొరేషన్, ఫిబ్రవరి 3ప్రభాతవార్త:

తిరుపతినగరపాలక కౌన్సిల్‌లో రెండో డిప్యూటీ మేయర్ ఎన్నిక లాంఛనంగా జరగాల్సి ఉన్నా బలమున్న వైసిపి కార్పొరేటర్లు కలసి సకాలంలో ఓటింగ్‌కు హాజరుకాలేకపోవడంతో కోరంలేక వాయిదాపడింది. 48మంది కార్పొరేటర్లలో ఒక టిడిపి కార్పొరేటర్ కాగా 47మంది వైసిపి వర్గీయులే. ఉదయం 11గంటలకు ఓటింగ్ జరిగే ఎస్వీయూ సెనేట్‌హాల్‌కు 21మంది కార్పొరేటర్లు , జనసేనపార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేరుకున్నారు. వీరంతా నిర్దేశించిన సమయానికి ఎన్నిక జరిగే సెనేట్‌హాల్‌లో వేచిచూశారు. అర్ధగంట,గంటసమయం దాటినా అవసరమైన బలం 26మంది లేకపోవడంతో డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదావేస్తున్నట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి,జెసి శుభం బన్సల్ మద్యాహ్నం 12.10గంటలకు ప్రకటించారు. అప్పటికే మేయర్, వైసిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి, ఎంపి, ఎంఎల్‌సితోబాటు 23మంది కార్పొరేటర్లు ఎస్వీయూ ప్రాంగణంలోకి చేరుకున్నారు. అయినా సమయం ముగియడంతో ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఉదయం 10.40గంటలకు వైసిపి కార్పొరేటర్లు అమరనాథ్, మునిరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్‌కె బాబు, ఆదం లీలావతి, దొడ్డారెడ్డి ప్రతాప్‌రెడ్డి, ప్రవలిక, ముద్రనారాయణ(డిప్యూటీ మేయర్),తాళ్ళూరిప్రసాద్, సునీత, రాజమ్మ, పొన్నాలచంద్ర, ఆదిలక్ష్మి, సికె రేవతి, శైలజ, కుమారి, కుడితి సుబ్రమణ్యం, నరేంద్ర, రాధ, నారాయణ, రాణి ఉన్నారు. మిగిలిన వాళ్ళు రాకపోవడంతో కోరం లేదని వాయిదాపడింది. అయితే 12.10గంటలకు అక్కడకు చేరుకున్న వైసిపి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌సి డాక్టర్ సుబ్రమణ్యం,మేయర్ మిగిలిన 21మంది కార్పొరేటర్లు నిస్సహాయస్థితిలో వెనుదిరిగారు. అయితే కూటమిపార్టీల నేతలు జనసేన నాయకులు తమను అడ్డుకున్నారని, దాడిచేశారని ఆరోపించారు. కాగా 17వ కార్పొరేటర్ రత్నకుమారి సొమ్మసిల్లి పడిపోవడంతో డాక్టర్ సుబ్రమణ్యం ఆమెకు ప్రథమ చికిత్స చేశారు. కాగా నేటికి వాయిదా పడిన డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళావారం ఏం జరుగుతుందనేది ఉత్కంఠ.కాగా ఎన్నికకు ముందే టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ కూటమికి మద్దతుతెలిపే కార్పొరేటర్లతో బయటనే నిరీక్షించి అందరితో మంతనాలు చేయడం విశేషం. ఇప్పటికే నలుగురు వైసిపి కార్పొరేటర్లు వైసిపికి చెందిన నలుగురు కార్పొరేటర్లు అనీశ్, బోకం అనిల్, మోహనకృష్ణయాదవ్, అమర్‌నాధరెడ్డిని కూటమి నేతలు కిడ్నాప్‌చేశారని ప్రధాన ఆరోపణగా మారింది.

## ప్రశాంత వాతావరణంలో 'డిప్యూటీ మేయర్ ఎన్నిక'
### తిరుపతి కార్పొరేటర్ల రక్షణపై "హైకోర్టు కీలక ఆదేశాలు"

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:

ప్రశాంత వాతావరణంలో డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీచేసింది. గత అనుభవాల దృష్ట్యా తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎటువంటి అపశృతులకు అవకాశం లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని హై కోర్టు స్పష్టం చేసింది. తిరుపతి ఎస్వీయు సెనెట్ హాల్ వెలుపల సైతం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలలో పేర్కొన్నది. అయితే తమకు పోలీస్ ఎస్కార్ట్ కల్పించాలని కోరుతూ కార్పోరేటర్లు ఎస్పీకి వినతిపత్రం అందజేయాలని సూచించింది. ఈ వినతి పత్రంలో బస్సులో ప్రయాణించే కార్పోరేటర్ల వివరాలు, ఆధార్ కార్డులోని వివరాలను నమోదు చేయడంతో పాటు అందరూ సంతకంచేసి ఎస్పీకి అందజేయాలని సూచించింది. ఆ మేరకు వినతిపత్రం అందుకున్న ఎస్పీ ఎస్వీయు సెనేట్ హాల్ వరకు కార్పోరేటర్లకు ఎస్కార్ట్ ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

## డెప్యూటీ మేయర్ ఎన్నికలు వాయిదా
### - అదనపు పోలీస్ బలగాలతో బందోబస్తు కొనసాగింపు- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా నందు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న డెప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశం నిబంధనల మేరకు కోరం లేక పోవడం వలన నేటి సోమవారం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తిరుపతి పట్టణం నందు 144 సెక్షన్ ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ దిశగా అదనపు బలగాలతో సుమారు 250 మందితో బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న ఆయన తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

### సప్తవాహన సేవకు
## సప్తగిరులు సిద్ధం
### -భక్తులకు లోటులేకుండా సకల సౌకర్యాలు



తిరుమల,పిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:

సూర్యజయంతి పురస్కరించుకుని నేటి ఉదయం నుండి రాత్రి వరకు కొండపై సప్తవాహనసేవలకు సప్తగిరులు సిద్ధమయ్యాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడు వాహనాలపై మలయప్ప ఊరేగి దర్శనమివ్వడం విశేషం. ఇప్పటికే భక్తులకు సకల సౌకర్యాలు, భద్రతను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. మాఢవీధుల్లో ఏర్పాట్లుపై, భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టీ,కాఫీ, పాలు అందించేలా టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు సమన్వయంగా సేవలందించేలా ఏర్పాట్లు చేశారు. 2లక్షలమంది భక్తులు ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీల్లో వేచివుండేందుకు జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. భక్తుల సేవకు శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులు సమాయత్తం అయ్యారు. మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో కూల్‌పెయింటింగ్ ,ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు.అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 3వతేదీ నుండి 5వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం
### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం కోళ్లమిట్టలో రూ.4.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోళ్లమిట్ట ప్రజలు గత కొన్నిరోజులుగా విద్యుత్ సమస్యలతో అవస్థలు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. అందులో భాగంగానే విద్యుత్ శాఖ వారు కోళ్లమిట్ట ప్రాంతంలో విద్యుత్ సమస్యల నివారణకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోళ్లమిట్టలోని వెంకయ్యస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని విజయశ్రీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు 50 వేల లక్ష్యాన్ని సాధించినందుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని పట్టణ టిడిపి అధ్యక్షులు ఆకుతోట రమేష్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఎజి కిషోర్, చిట్టేటి పెరుమాళ్లు, చెన్నెం శ్రీనివాసులు, సరిత, అలవల శ్రీనివాసరావు, ఏఇ మోహిని, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 5 నుంచి 20వ తేది వరకు ఇంటర్ ఆన్‌లైన్ ప్రాక్టికల్ పరీక్షలు
### - ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :

ఫిబ్రవరి 5 నుంచి 20వ తేది వరకు జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయని, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై డీఆర్వో నరసింహులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ (జనరల్) మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి 20వ తేది వరకు జరగనున్నాయని ఈ పరీక్షల నిర్వహణ పగడ్బందీగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరుగునున్నాయని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ 24927 మంది విద్యార్థులు 124 కేంద్రాలు, ఒకేషనల్ 2355 మంది అభ్యర్థులకు 23 పరీక్షా కేంద్రాలలో ప్రాక్టికల్స్ నిర్వహణ ఉంటుందని తెలిపారు.



విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించే గదుల్లో సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ పరీక్షా కేంద్రాలకు రవాణాశాఖ వారిచే రైల్వే, బస్ స్టేషన్ల నుంచి బస్సు సౌకర్యములు ఏర్పాటు చేయడమైనదని, పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఆరోగ్యశాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పుత్తూరు రఘుపతి, చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, పుత్తూరు బాలుర ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, చంద్రగిరి బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రవి, విద్యుత్‌శాఖ ఈఈ వాసవీలత, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరీ వర్సిటీలో కదంతొక్కిన విద్యార్థులు

తిరుపతి విద్య ఫిబ్రవరి 3 ప్రభాత వార్త:

వెటర్నరీ జూడాల నిరసనలు, ర్యాలీలతో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ దద్దరిల్లింది. గౌరవవేతనం చెల్లింపు విషయంలో వెటర్నరీ వైద్య విద్యార్థుల పట్ల ప్రభుత్వ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇచ్చే గౌరవవేతనాన్ని తమకు అమలు చేయాలని ఆదివారం నుంచి వర్సిటీలో ప్లేకార్డులు చేతబూని ధర్నాలు, ర్యాలీతో కదంతొక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నో ఏళ్లుగా తమకు రూ.7 వేలు మాత్రమే గౌరవవేతనం అందిస్తున్నారని, ఎంబీబీఎస్ విద్యార్థులకు రూ. 26 వేలు చెల్లిస్తూ పనిచేసే ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన, టీఏ, డీఏలు చెల్లిస్తున్నారని తెలిపారు. తమ పట్ల ప్రభుత్వం, వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణమని మండిపడ్డారు. కనీసం రోజు కూలీలకు వచ్చే దినసరి కూలి సైతం తమకు అందకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం అందిస్తున్న గౌరవ వేతనం రోజువారీ ఖర్చులకు సరిపోవడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. తక్షణం గౌరవవేతనాన్ని రూ.30 వేలకు పెంచి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఇప్పటికే తిరుపతి వెటర్నరీ కళాశాలలతో పాటు ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడిలో వెటర్నరీ జూడాలా నిరవధిక సమ్మెకు దిగారని తెలిపారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

## పక్కాగా సమస్యలు పరిష్కారం- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలోసోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను ప్రత్యేక శ్రద్ద వహించి బాధ్యతతో పని చేసి పూర్తి చేయాలని ఆదేశించారు.

## రెవెన్యూశాఖ నిర్లక్ష్యం : మాస్టర్ ప్లాన్ అమలుకు శాపం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుమారు రూ.వంద కోట్లు వెచ్చించి సుమారు 200 ఇళ్ళు,3.54 ఎకరాల స్థలం దేవాదాయశాఖ 2018లో సేకరించింది.అప్పటి ఆలయ ఇఓ డి.భ్రమరాంబ పట్టుదలతో చొరవ తీసుకొని అప్పటి ముఖ్యమంత్రి(ఇప్పటి) నారాచంద్రబాబునాయుడు ఆదేశాలతో మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టారు. దేవాదాయశాఖయే రెవెన్యూ అంచనాల మేరకు ఆలయం చుట్టూ ఉన్న ఇళ్ళను తొలగించుటకు వారికి నష్టపరిహారం చెల్లించారు.అలాగే కొన్ని కమర్షియల్ భవనాలను కూడా సేకరించారు. నష్టపరిహారాలను దేవాదాయశాఖయే చెల్లించింది. అలాగే 3.54 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించారు.అయితే ఇద్దరు మాత్రం మొండికేశారు. అందులో ఒకరు స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న లాడ్జి. మరొకటి సన్నిధివీధిలోని లాడ్జి. ఇరువురు తమకు నష్టపరిహారం సరిపోదని మొండికేశారు.

### ఐదేళ్ళుగా పరిష్కరించని రెవెన్యూశాఖ:

శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్ అమలు చేసి పాతికేళ్ళ ప్రణాళికను రూపకల్పన చేసారు.అయితే నాలుగేళ్ళ వైకాపా పాలనలో మాస్టర్ ప్లాన్ అమలుకు సంబందించి స్పష్టమైన చర్యలు లేదు. అంతేకాక ప్రభుత్వం మొండికేసిన యజమానులకు సంబందించిన భూముల సేకరణకు జిఒ జారి చేసారు. అయితే ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోలేదు. నేడు ప్రభుత్వంలో కీలకంగా ఓ ప్రభుత్వ కార్యదర్శి హయాంలోనే కమిటి సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించి ఉండవచ్చు. కానీ పట్టించుకోలేదు. జిల్లా విభజన తరువాత కూడా భక్తుల సొమ్ము వంద కోట్లు అప్పనంగా ఖర్చుపెట్టి లక్ష్యాన్ని చేరుకోవటానికి అడ్డంకిగా ఉన్న భవనాన్ని సేకరించే ప్రయత్నం చేయలేదు.ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధుల ప్రకటనలే తప్ప రెవెన్యూ అధికారులు స్పందించలేదు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి సమావేశం ఏర్పాటు చేసి భూసేకరణకు చర్యలు తీసుకోవచ్చు. కానీ ఎందుకో ఆ దిశగా అడుగులు పడటం లేదు.గత పాలకులు పట్టించుకోక పోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ రూపకల్పన తన తండ్రి ప్రణాళిక కాబట్టి అమలుకు పట్టుదలగా ఉన్నారు.ఈ సమస్యను ఆయన పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. యువ నాయకుడు నారాలోకేష్‌కు ఫిర్యాదు చేసారు.దేవాదాయశాఖ మంత్రికి పిర్యాదు చేసారు.

### ఏళ్ళు గడుస్తున్నా అమలు చేయని భూసేకరణ



# శాస్త్రసోక్తంగా శ్రీవీరాంజనేయ స్వామి బాలాలయ ప్రతిష్ట

కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం ప్రాంగణంలో శ్రీవీరాంజనేయస్వామి బాలాలయ ప్రతిష్ట మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం వున ్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని పడగొట్టి సుమారు 1.10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో రాతితో పునర్నిర్మాణం చేయడానికి అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు అనిల్ అనే భక్తుడు ముందుకు వచ్చిన విషయం విధితమే. ఈమేరకు ఆలయాని ్న పడగొట్టడానికి వీలుగా బాలాలయం ఏర్పాటు చేశారు. బాలాలయ ప్రతిష్ట



మహోత్సవం పూజలు ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో శని, ఆలయ ఉప ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు, స్థానాచార్యులు ఫనిస్వామిల ఆధ్వర్యంలో ప్రారంభం కాగా సోమవారం బాలాలయ ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహజంచారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు బాలాజినాయుడు, రవి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, నాయకులు పూర్ణచంద్రరావులతో పాటు ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## విరివిగా రక్తపరీక్షలు
### - జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్

చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
క్షేత్ర స్థాయిలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు కన్పిస్తుండటంతో విరివిగా రక్తపరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో



అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్‌తో కలిసి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ సోమవారం ల్యాబ్ టెక్నిషియన్లతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అర్డీటి కిట్ల ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి పరీక్షించాలన్నారు. యాక్టివ్, పాసివ్ పరీక్షలను విరివిగా చేసి పాజిటివ్ నిర్ధారణ అయితే సత్వరం చికిత్స ప్రారంభించాలని ఆదేశించారు. అర్డీటి కిట్ల పరీక్షలో డెంగ్యు పాజిటివ్ వస్తే ఎలిసా పరీక్షలకు జిల్లా ఆసుపత్రికి పంపాలన్నారు. అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ ఓపికి హాజరైన పేషంట్లలో 10 శాతం మందికి టిబి పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే పిహెచ్‌సిలో ప్రతి ఆశ గళ్ళ పరీక్ష నిర్వహించి అనుమానిత కేసుల నుండి సేకరించిన గళ్ళను పరీక్షించాలన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్, ఎఎంఓ రామచంద్రారెడ్డి, శివకుమార్, ల్యాబ్ టెక్నిషియన్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలి
### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశిం చారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పెన్షన్లు, ఇళ్ల మంజూరు, రెవెన్యూ సమస్యలపై వినతులు అందిం చారు. వీటిని ఆయా శాఖల ద్వారా పరిష్కరించాలని పిడి ఆదేశించారు. కార్యక్రమాల్లో డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఓ విజయ్‌దత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జల్లి క్వారీల నిర్వహణకు అనుమతులకై వడ్డెరకులస్తుల వినతి

కుప్పంరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
కుప్పం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న వడ్డెర కులస్తులు అయిన తమకు జల్లి క్వారీలు నిర్వహించి రాళ్లుకొట్టుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ శ్రీవరసిద్ది వినాయక వడ్డెర సేవా సంఘం తరపున కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. తాము గత కొన్నేళ్లుగా వందలాది కుటుంబాలు కుటుంబ పోషణకై కులవృత్తి అయిన రాళ్ల కొట్టుకునే పనులు చేసుకునేవారనామన్నారు. దీనిపై పి.డి. మాట్లాడుతూ త్వరలోనే రాతి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, వడ్డెర సంఘ నేతలు మునిరత్నం, రవి, నారాయణ, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లేశ్వరి స్వామి ఆలయంలో విశేష పూజలు

కల్లూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త
పులిచర్ల మండలం జాంద్రపేట శ్రీ మల్లేశ్వరి స్వామి ఆలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యము సమర్పించి మహా మంగళ హారతి గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి వసంత పంచమి విశిష్ట గురించి భక్తులకు వివరించారు. ఉభయదారులు పేరావాండ్ల పల్లకి చెందిన వెంకటరామయ్య సదుంకు చెందిన కృష్ణయ్య కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త
పట్టణంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అర్చకులు శ్రీనివాసులు తెలిపారు. ఆలయంలో మంగళవారం వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనం ప్రారంభమవుతుందని చెప్పారు. వాహన సేవలలో భక్తులు పాల్గొనాలని కోరారు.





## జ్ఞాన ప్రదాయనీ సరస్వతీ నమోస్తుభ్యం

చౌడేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
జ్ఞాన ప్రదాయనీ సరస్వతీదేవీ నమోస్తుభ్యం అంటూ భక్తులు మోకరిల్లారు. మాఘమాసం వసంత పంచమి సందర్భంగా పుదిపట్ల వైష్ణవీమాతను విద్యను ప్రసాదించే సరస్వతీదేవిగా అలంకరించారు. సరస్వతీదేవీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణగావించారు. అంతేకాకుండా విద్యాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించాడు.

## ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన బిజెపి నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త
కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సోమవారం నివాసంలో రాష్ట్ర బిజెపి మైనారిటీ నాయకులు అయూబ్ ఖాన్, తెలుగుదేశం నాయకులు శ్రీరాములు కలిశారు. పుంగనూరులో ఏర్పాటు చేసిన ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరణ చేయడానికి పుంగనూరు నందు పర్యటించాలని విజ్ఞప్తి చేశామన్నారు.



## అక్రమంగా తమిళనాడుకు కలప తరలింపు

పాలసముద్రం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



కాదేది అక్రమ రవాణాకు అనర్హం అనే చందంగా తయారైంది పాలసముద్రం మండలం నుండి తమిళనాడు రాష్ట్రానికి అక్రమ తరలింపులు. ఇప్పటి వరకు ఇసుక, బియ్యంను భారీ మొత్తంలో తమిళనాడు రాష్ట్రానికి తరలించి లక్షల రూపాయలు ఆర్జించిన అధికార పార్టీ మద్దతుదారులు ఇప్పుడు రూటు మార్చారు. పాలసముద్రం నుండి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా కలపను తరలించి డబ్బులు ఆర్జించడానికి సిద్ధం అయ్యారు. ఇదే అదనుగా పాలసముద్రంలో నిల్వ వున్న చింత కలపను భారీగా లారీలో లోడ్డు చేసుకుని తమిళనాడు రాష్ట్రానికి తరలించడానికి సిద్ధం అయ్యారు. ఈ విషయం తెలిసిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న చింత కలపను నిలుపుదల చేశారు. అయితే అధికార పార్టీకి చెందిన ఓ నేత జిల్లా అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి కలపను ఇతర ప్రాంతానికి తరలిస్తుంటే అటవీశాఖ అధికారులు నిలబెట్టేశారని ఫిర్యాదు చేయడంతో స్థానిక అటవీశాఖ అధికారి లారీలో అర్ధ టన్ను చింత కలపకు జరిమానా విధించి మిగిలిన కలపను విడిచిపెట్టారు. ఈ ఘటనతో పాలసముద్రం మండలం నుండి తమిళనాడు రాష్ట్రానికి అక్రమ రవాణా చేయడానికి కాదేది అక్రమ రవాణాకు అనర్హం అనే నానుడి సరిపోయింది.

## శాంతిపురం మండలానికి 133 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు

శాంతిపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బ్యాంకు ఆధారిత స్వయం ఉపాధి పథకంలో భాగంగా శాంతిపురం మండలానికి బిసి, కాపు, కమ్మ, బ్రాహ్మణ, రెడ్డి, క్షత్రియ, వైశ్య కార్పోరేషన్‌ల ద్వారా 133 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. బిసి (ఎ,బి,డి,ఇ)లకు 97యూనిట్లు, ఇబిసిలు 5, కాపు 21, రెడ్డి 4, కమ్మ 4, బ్రాహ్మణ 1, వైశ్య 1 వంతున యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు.అర్హత కలిగిన వారు తమ ఆధార్, రేషన్, కులధృవీకరణపత్రం, బ్యాంక్‌పాస్ పుస్తకం, ఫోటో ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 7వతేది లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూత ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు.

## సుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధికి 3.49కోట్లు మంజూరు

రామకుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
స్థానిక శ్రీ వల్లీ సుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్ 3.49కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనిధులతో ఆలయ పునర్నిర్మాణం, అభిషేక మండపం నిర్వహించాలని సూచించారు. నిధులు మంజూరు కావడంతో ఆలయ నిర్వాహకులు పివి సీతాపతి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, స్థానిక నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కుప్పం దేవాలయాల అభివృద్ధికి 50.38కోట్లు

గుడుపల్లి,ఫిబ్రవరి 03, ప్రభాతవార్త
కుప్పం నియోజక వర్గంను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రసిద్దిగాంచిన 11 దేవస్థానములకు అభివృద్ధి చేయుటకు గాను 50.38 కోట్లు మంజూరు చేసిన మన ఆరాధ్య దేవుడు ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదములు తెలిపారు.ఈ సందర్భంగా కుప్పం సమన్వయ కమిటీ ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పియస్ మునిరత్నం,సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ కుప్పం నియోజక వర్గంలోని శ్రీవల్లీ దేవసేన సమ్మెత శ్రీసుబ్రమణ్య స్వామి దేవస్థానం గుడివంక రూ=48700000,శ్రీగంగాధరేశ్వర స్వామి దేవాలయం గుడివంక రూ= 18700000,శ్రీద్రౌపతి సమ్మెత శ్రీధర్మరాజుల దేవస్థానం కర్లగట్ట రూ=53400000,శ్రీకధిరిలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం రామకుప్పం రూ=34900000,శ్రీద్రౌపతి సమ్మెత శ్రీధర్మరాజుల దేవస్థానం యామగానిపల్లి రూ=69300000,శ్రీబేటరాయస్వామి దేవస్థానం పరమసముద్రం రూ=26600000,శ్రీమల్లీశ్వర స్వామి దేవస్థానం మల్లప్పకొండ రూ=3870000,శ్రీకోదండరామస్వావమి దేవస్థానం రాళ్ళబూదుగూరు రూ=78500000,శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ తల్లి దేవస్థానం కుప్పం రూ=87200000,మంజూరు చేసినట్లు తెలిపారు.

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారికి సోమవారం రాత్రి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకం ఆలయంలో వసంత పంచమి పర్వదినం సందర్భంగా స్వామివారికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆలయ మాజీఛైర్మన్ అగరం పల్లెకు చెందిన ఎ.మోహన్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ప్రత్యేపల్లకిపై స్వామి, అమ్మవార్లను వుంచి వ నదుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి,సూపరెండెంట్ వాసు, అర్చకులు వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్లు దరఖాస్తు చేసుకోండి

పూతలపట్టు, ఫిబ్రవరి 3, ప్రభాత వార్త
మండలంలోని 2024 – 25 సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలానికి 60 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. బిసి కాపు రెడ్డి కమ్మ బ్రాహ్మణి ఆర్యవైశ్య క్షత్రియ సామాజిక వర్గాలుకు చెందిన వారు ఈ నెల 7వ తేదీలోగా ఆన్లైన్లో ఏపీ ఓ బి ఎం ఎం ఎస్ వెబ్సైట్ నందు గ్రామ దరఖాస్తుకు చేసుకోవాలని సూచించారు బీసీ కులాలకు చెందిన అభ్యర్థుల యొక్క వయసు 21 – 60 సంవత్సరాలు ఉండవలెను అదేవిధంగా కాపు బలిజ తెలాగా ఒంటరి కులమునకు చెందిన అభ్యర్థులకి మాత్రం 21 డాష్ 50 సంవత్సరాలు లోపు ఉండవలెను దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పాస్ సైజు ఫోటోలు 2 ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. గేదెలు గొర్రెలు దుకాణాలకు రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పోలీస్ స్పందనకు 37 ఫిర్యాదులు

చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం మొత్తం 37 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో భూతగాదాలకు సంబంధించి అత్యధికంగా 12 ఫిర్యాదులు అందగా కుటుంబ తగాదాలపై 7, వేధింపులు 3, ఇంటి తగాదాలు 5, ఆర్థిక లావాదేవిలు 5, దారి సమస్యలపై 5 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.



## నిర్ణీత వ్యవధిలో గోకులాల నిర్మాణాలు పూర్తి

పెనుమూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
గోకులం షెడ్లు మంజూరైన లబ్దిదారులు నిర్ణీత వ్యవధిలో నిర్మాణాలను పూర్తి చేయాలని డ్వామా ఎపిడి సుబ్రమణ్యం పేర్కొన్నారు. గోకులం షెడ్లు మంజూరైన లబ్దిదారులకు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎపిడి సుబ్రమణ్యం మాట్లాడుతూ 6 పశువులు వున్నట్లైతే రూ.2.30 లక్షలు, 4 పశువులు వున్నట్లైతే రూ.1.85 లక్షలు లబ్దిదారులకు మంజూరు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నీలకంఠరెడ్డి, ఎపిఓ గుణశేఖర్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సతీష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ పరదేశి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ట్రిప్పర్ - కంటైనర్ ఢీ - ఇద్దరికి గాయాలు



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మొగలిఘాట్ దొరచెరువు వద్ద సోమవారం ఉదయం ట్రిప్పర్, ట్యాంకర్‌తో పాటు కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు నుండి చెన్నై హార్బర్‌కు కంటైనర్ వెళ్తూ ముందు వెళ్తున్న ట్రిప్పర్‌ను ఢీకొంది. ట్రిప్పర్ ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో కారు రోడ్డు ప్రక్కకు వచ్చి ఆగింది. ఈ ప్రమాదంలో ట్రిప్పర్ డ్రైవర్ మర్రిమాకులపల్లికి చెందిన శ్రీనివాసులు, కంటైనర్ డ్రైవర్ దిండిగల్‌కు చెందిన చిరంజీవిలు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి ఆటోనగర్‌కు చెందిన ఆరుముగం, లలితకుమారిలు తమ కారులో బెంగళూరు నుండి తిరుపతికి వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. అయితే వారికి ఎలాంటి గాయాలు తగలలేదు. కారు ధ్వంసం అయ్యింది. ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాతా శిశు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
మాతా శిశు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్ర ప్రభుత్వ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ అధికారి డాక్టర్ పర్వీన్ సుల్తానా పేర్కొన్నారు. చిత్తూరు నగర పరిధిలో టెలిఫోన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం డాక్టర్ పర్వీన్ సుల్తానా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె క్షేత్ర స్థాయిలో జాతీయ కార్యక్రమాలు అమలు తీరును పరిశీలించి మాట్లాడుతూ సమాజ ఆరోగ్యానికి మొట్టమొదటి సూచిక మాతా శిశు ఆరోగ్యమేనని, ప్రతి ఒక్కరు ఆ దిశగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాఉ. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ జానకిరామ్, డాక్టర్ ప్రశాంతి, కెటి ప్రసాద్, రామ్మోహన్, స్థానిక అర్బన్ ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



చిత్తూరు–పుత్తూరు రహదారిలో పుల్లూరు క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వేగంగా వెళ్తున్న టాటా ఎసి వాహనం ఒక్కసారిగా బోల్తా పడటంతో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ ఈ ఘటనలో మృతి చెందగా మరో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పాతపాళ్యం గ్రామస్తులు ఎట్టేరి గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరు కావడానికి టాటా ఎసి వాహనంను మాట్లాడుకుని వెళ్తుండగా వాహనం మార్గ మధ్యలో ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి ఎస్ఆర్ పురం పిహెచ్‌సికి తరలించి వైద్యం అందించగా 108 వాహనం ఆలస్యంగా సంఘటనా స్థలం చేరుకుంది. ఎస్ఆర్ పురం పిహెచ్‌సిలో పదిహేను మందికి ఒక్కసారిగా వైద్యం చేయాల్సి రావడంతో కనీస సౌకర్యాలు సైతం లేని పరిస్థితుల్లో వైద్య సిబ్బంది క్షతగాత్రులకు అరాకొర వైద్యం చేశారు. ఈ మేరకు ఎస్ఆర్ పురం పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్య విద్యార్థుల్ని సమర్థ ఆరోగ్య నిపుణులుగా చేయడమే లక్ష్యం
### - పిఇఎస్ వైద్య కళాశాల డీన్ డా॥ కృష్ణారావు

కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
వైద్య విద్యార్థులను సమర్థవంతమైన ఆరోగ్య నిపుణులుగా తీర్చిదిద్దడమే పిఇఎస్ విద్యాసంస్థల లక్ష్యమని పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ హెచ్ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం పిఇఎస్‌లో అల్లయిడ్ హెల్త్ సైన్సెస్ మరియు బిపిటి తరగతులను ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా డీన్ మాట్లాడుతూ హెల్త్ కేర్ రంగంలో అల్లయిడ్ హెల్త్ సైన్సెస్ ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. వైద్య సేవలు అందించే విధానంలో బహుళ శాస్త్ర విధానాల అవసరం ఉందన్నారు. అల్లయిడ్ హెల్త్ నిపుణులు డయాగ్నస్టిక్, థెరప్యూటిక్ కేర్, రీహాబిలిటేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్నారని వివరించారు. పిఇఎస్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ వైస్ ప్రిన్సిపాల్ డా॥ సత్యశీలన్ మాట్లాడుతూ పిఇఎస్ కాలేజ్ విద్యా వాతావరణాన్ని ప్రశంసించారు. అల్లయిడ్ హెల్త్ మరియు ఫిజియోథెరపిస్ట్‌ల తోడ్పాటుతో రోగుల సేవలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడిలు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త
ప్రకృతి పరంగా లభించే వనరులతో వ్యవసాయం చేయడమే ఆరోగ్యదాయకమని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి భువనేశ్వరి అన్నారు. సోమవారం పురపాలక కార్యాలయం అవరణంలో రైతు సాధికార సంస్థ వారిచే ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శన, విక్రయాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో హానికర క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అన్నారు.

## పడిపోయిన బంగారు బ్రాస్‌లెట్ రింగ్ భక్తురాలికి అప్పగింత



కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:
ఆలయ దర్శనార్థం వచ్చి కొబ్బరికాయలు కొడుతూ పోగొట్టుకున్న 17 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్ రింగ్‌ను భక్తురాలికి దేవస్థాం అధికారులు అప్పగించిన సంఘటన కాణిపాకం దేవస్థానంలో సోమవారం చోటుచేసుకుంది వివరాలిలావున్నాయి. బెంగుళూరుకు చెందిన డి.సౌజన్య అనే భక్తురాలు కుటుంబసభ్యులతో కలసి సోమవారం కాణిపాకం ఆలయం దర్శనార్థం వచ్చారు. ఈనేపథ్యంలో దేవస్థానం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చేతిలో వున్న బ్రాస్‌లెట్ జారి పడిపోయిన విషయాన్ని గుర్తించి ఆలయ అధికారులకు సమాచారం అందించారు. ఈమేరకు కొబ్బరి కాలయంలు కొట్టే సిబ్బంది వెతికి బ్రాస్‌లెట్‌ను ఆలయ ఈఓ ద్వారా భక్తురాలికి అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తవణంపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ మేజర్ గ్రామపంచాయతీ నల్లప్పరెడ్డిపల్లె గ్రామంలో ఆకస్మికంగా మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియల కోసం ఆకుటుంబానికి పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులు సోమవారం ఆర్థికసాయం అందించారు. వివరాలిలా వున్నియి, నల్లప్పరెడ్డిపల్లె దళితవాడకు చెందిన రమేష్ అనే వ్యక్తి ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. దీనితో స్థానిక మాజీ సర్పంచ్ జి.కరీం 10 వేల రూపాయలను, పైమాఘంకు చెందిన లైన్ ఇన్స్‌పెక్టర్ టి.కుమార్ ఐదు వేల రూపాయలను మృతుని అంత్యక్రియల కోసం మృతుని క కుటుంబానికి అందజేశారు.ఈమొత్తా_న్ని పంచాయతీ వారు సభ్యుడు ఎస్, నాగరాజు ద్వారా అందజేశారు.

## పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న చియ్యవరం గ్రామస్తులు
### -పట్టించుకోని వెలుగు అధికారులు

.తొట్టంబేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో నిరుపేద సంఘమిత్రలు పొదుపు చేసుకున్న సొమ్ములు రూ.2.16కోట్లుపైగా ఇద్దరు సంఘమిత్రలు స్వాహా చేసినట్లు ఉన్నత స్థాయి విచారణలో తెటతెల్లమైన విషయం విదితమే. అయితే రూ.54లక్షలు రికవరి చేసినట్లు వివరించారు.గత కొద్ది కాలంగా ఇద్దరు నిర్వాహాకులు పొదుపరుల నమ్మకాన్ని వమ్ము చేసి రాజకీయ ముసుగులో కోట్లు స్వాహా చేసారు. అయితే గతంలో కూడా విచారణలు జరిపినా రాజకీయ మద్దతుతో చర్యల్లేదు. ప్రస్తుతం మరో సారి విచారణ జరిపారు. స్వాహా వాస్తమేనని నిగ్గు తేల్చారు. తర్వాత తూతూ మంత్రంగా చర్యలుతీసుకున్నారు. అయితే శనివారం శివరాత్రి సమీక్షకు విచ్చేసిన దేవాదాయశాఖ, రెవెన్యూశాఖ మంత్రులకు మహిళా సంఘాల లీడర్లు వినతిపత్రాలుఇచ్చి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఇద్దరు సంఘమిత్రలు చేతిన చేతివాటానికి బ్యాంకు అధికారులు తమకు నోటీసులు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలోని వెలుగు కార్యాలయంలో గతంలో ఎపిఎంగా ఉన్న గురుమూర్తి హయాంలో మండలంలోని సంఘమిత్రలుగా పనిచేస్తున్న ముని లక్ష్మి, మునిశేఖర్‌లు రూ.2.16కోట్లు పైగా స్వాహాచేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో విషయం బయటపడడంతో పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడి పంచాయతీల్లో అక్రమాలుపై విచారణ చేపట్టాలనిఆదేశించారు. ఒక్క చియ్యవరంలోనే కాకుండా గుండేలిగుంట, చోడవరం, కాసరం, రాంబట్లపల్లిలో ప్రత్యేక బృందాలు గతంలో విచారణ చేసి తూతూ మంత్రంగా ముగించారు. తమ భర్తలు తమను కొడుతున్నారంటూ సంఘమిత్రలపై పోలీసులకు పిర్యాదు చేసేందుకు తొట్టంబేడు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అయితే ఎస్ఐ ఈశ్వరయ్య తిరుమల బందోబస్తు నిమిత్తం వెళ్ళడంతో స్థానిక పోలీసు అధికారులుకు పిర్యాదుచేసినట్లు సమాచారం. తమను నిండా ముంచిన సంఘమిత్రలను వెంటనే అరెస్టుచేసి వారి నుంచి నగదు రికవరీ చేయాలని పోలీసులకు పిర్యాదుచేశారు.ప్రస్తుత ఎపిఎం ఇందిరాగాంధీ తనకు ఈ సంఘటనపై ఎలాంటి వివరాలు తెలియదని పేర్కొంటున్నారు.



## రథసప్తమి వేడుకలకు అంతా సిద్ధం

నారాయణవనం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :
మండలకేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో నేడు(అనగా) 4వ తేది మంగళవారం రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని ఏడు వాహనాల్లో స్వామి,అమ్మవార్లు ఊరేగడం జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం సూర్యప్రభవాహనంపై స్వామి, అమ్మవార్లు ఊరేగించడం జరుగు తుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉదయం 9గంటల నుంచి చిన్నశేష, హంసం, కల్పవృక్ష, పెద్దశేష, తిరుచ్చివాహనంపై ఊరేగతారన్నారు. రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహనంతో ఉత్సవాలు ముగుస్తుందన్నారు.

## ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో సరస్వతీ పూజ

తిరుపతి విద్య,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :
శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో తెలుగు,సంస్కృతం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి పూజ ఘనంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బి. సత్యనారాయణ తెలిపారు. తమ కళాశాల ప్రాంగణంలో కొలువై ఉన్న సరస్వతి దేవిని చక్కగా అలంకరించి, సరస్వతీ ద్వాదశ నామ స్తోత్రం, నీల సరస్వతీ స్తోత్రం, శ్యామ్మలా దండకం లాంటి అనేక స్తోత్రాలతో అమ్మవారిని భక్తి ప్రపత్తు లతో స్తుతించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గోపుర బాధితులకు నష్టపరిహారం చెల్లింపు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో రాజగోపుర బాదితులకు సోమవారం ఇఓ టి.బాపిరెడ్డి నష్టపరిహారాన్ని అందించారు. శ్రీకాళహస్తిలో రాజగోపురం కూలినపుడు తిరిగి నిర్మించుటకు నవయుగ కన్‌స్ట్రక్షన్స్ ముందుకు వచ్చింది.ఈ సందర్భంగా నష్టపోయిన వారిలో కొందరికి పరిహారం నిర్మాణాలకు చెల్లించారు.కానీ భూమి విలువను అందించలేదు. ఈ నేపధ్యంలో ప్రస్తుతం అభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణాలను చేపట్టగా లబ్దిదారులు అడ్డుకున్నారు. అయితే ఈసమస్యకు సంబందించి ఇఓగా బాపిరెడ్డి బాధ్యతలు చేపట్టిన సమయంలో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డి వివరించగా ఆయన వెంటనే దేవాదాయశాఖకు నివేదిక పంపారు. ఈ సమస్యపై స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సంబంధిత మంత్రుల దృష్టికి తెచ్చారు. ఈ సమస్య పరిష్కరిస్తామంటూ భరోసా ఇచ్చారు.ఈ సమస్యను ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తికి వచ్చిన రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తేగా ఆయన వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు.ఈ నేపధ్యంలో గోపురం బాధితులు ఆర్ ఎన్ మాల, వి.సుశీలమ్మ బాధితులకు పరిహారం చెక్కులను అందించారు.

## టీడీపీ నాయకుల మృతికి...ఎమ్మెల్యే సంతాపం



వడమాలపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ నాయకులు మృతికి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంతాపం తెలిపారు. ఆదివారం రాత్రి పెళ్లికి తిరిగి వస్తుండగా నగరి రామాపురం వద్ద ప్రైవేటు బస్సును లారీ ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. మృతుల్లో వడమాలపేట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పార్థసారథి నాయుడు, రాజేంద్రనాయుడు ఉన్నారు. ఒకే గ్రామంలో బంధువులు ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. మృతులు కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. పరామర్శించిన వారిలో నాయకులు ధనంజయలునాయుడు, చినబాబు, హరి, దేవా, హేమావతి తదితరులు ఉన్నారు.

## థ్యాంక్స్ ఎమ్మెల్యే సార్!

### -రోడ్డు మరమ్మతు చర్యలు చేపట్టడంతో హర్షం తెలుపుతున్న గ్రామస్తులు



విజయపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: మండలంలోని ఒరురు వద్ద తిరుత్తణి- నాగలాపురం రోడ్డు గత రెండు సంవత్సరాలుగా గుంతలమయమై వర్షపునీరు నిలిచి బురదమయమైంది. ప్రతి రోజు రోడ్డున వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడేవారు. సారూ రోడ్డును మరమ్మతు చేయండి అంటూ పత్రికల్లో రెండు, మూడు పర్యాయాలు కథనం రావడంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవ తీసుకుని యుద్ద ప్రాతిపదికన మరమ్మతు చర్యలు నిర్వహించడంతో థ్యాంక్స్ ఎమ్మెల్యే సార్ అంటూ గ్రామస్తులు ధన్యవాదం తెలియజేస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమంలో థ్యాంక్స్ భాను సార్ అంటూ పోస్టులు పెడుతున్నారు.

## నూతన ఈద్‌గాహ్ నిర్మాణానికి శ్రీకారం



తొట్టంబేడు,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఈదుల గుంటలో పురాతన ఈద్‌గాహ్‌లో అభివృద్ధికి సోమవారం ఉదయం ముఫ్తి నయిం సాహెబ్ ప్రార్థనలతో శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఈద్‌గాహ్ అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరుకు ప్రకటించారు.ఈ నేపధ్యంలో రంజాన్ ప్రార్ధనలు జరుపుటకు ఇంకా 50 రోజులుండటంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈద్‌గాహ్ గోడను గురించి చరవాణిలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మత పెద్దలతో పార్టీ నాయకులతో చర్చించారు. ఇక్కడ ఉత్తరదక్షిణంగా వంద అడుగుల గోడను మినార్‌ల నమూనాలను రూపకల్పన చేసారు.ఈ పూజా కార్యక్రమాల్లో జామియా మస్‌జిద్‌ముతవల్లి అక్రంసాహెబ్,ముఫ్తీ నయిం సాహెబ్, పేష్ ఇమాం మౌలాన రేహాన్ సాహెబ్, మసీదు బాధ్యులు అంజద్‌సాహెబ్, తాజుద్దీన్,పఠాన్ నూరుల్లా ఖాన్,ఖాజీ సాహెబ్ మున్నా,షేక్ మహమ్మ్యాద్, ఇంజనీర్ మహబూబ్ బాషా, తెలుగుదేశం షాకీర్ అలి,షఫీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడు రైల్వే స్టేషన్లో వ్యక్తికి గాయాలు

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ఏర్పేడు రైల్వేస్టేషన్లో సోమవారం ఉదయం ఓ వ్యక్తి తీవ్ర రక్త గాయాలతో రైలు పట్టాలపై పడి ఉండగా కీ మెన్ గుర్తించి రైల్వే అధికారులకు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఆతని వద్ద ఎలాంటి ఆధారాల్లేవు.దాంతో ఆతన్ని రైల్వే పోలీసులు తిరుపతి రుయాకు 108లో పంపారు. ఆతను రైల్వే పయనిస్తూ కింద జారి పడ్డాడా? లేక ప్లాట్‌ఫాం మీద నుంచి జారి పడి గాయపడ్డాడా? అనే దిశగా పోలీసులు విచారిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు ఆతని ఫోటోలను గూడూరు పరిసర గ్రామాల వారికి పంపినట్లు వివరించారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నాడని చేయి ఎముక కట్ అయినట్లు డాక్టర్లు తెలిపినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనూ, పరిసరాల్లో దేవాలయాలు వెలసి భక్తి భావం వెల్లివిరుస్తుంది. అయితే కొందరు ఆకతాయిలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం,అల్లర్లు సృష్టించటం జరుగుతుంది.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐ డి.గోపి చొరవ తీసుకొని ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయటం, సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న గంగాసదన్ వద్ద సమీపంలో అడ్డదిడ్డంగా మద్యం బాటిల్స్‌ను గమనించారు.వెంటనే వారు సమీపంలోని బిసి కాలనీ వాసుల్ని చైతన్యవంతుల్ని చేసారు. ఇఓ బాపిరెడ్డి ఆదేశాలతో సిఐ డి.గోపి, కానిస్టేబుల్స్ కన్నయ్య, రవి,మనోహర్, ప్రసాద్, నాగరాజు నాయుడులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి: కమిషనర్

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో అర్హులైన లబ్ధిదారులు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.యస్.గిరికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రవాణా, పరిశ్రమ, సేవ వ్యాపార రంగాల్లో వారు బి.ఫార్మసి, డి.ఫార్మసి చేసిన నిరుద్యోగులకు జనరిక్ ఫార్మసీలు ఏర్పాటు చేసుకోవటానికి వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ది చేకూర్చనున్నట్లు కమిషనర్ తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెల్ఫేర్ కార్యదర్శి ద్వారా పంపాలని కమిషనర్ సూచించారు.

## ఇంటి స్థలాలు ఇవ్వాలని కలెక్టర్‌కి వినతి

కేవీబీ పురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని కళత్తూరు దళితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని జనసేన మండల అధ్యక్షుడు థామస్ సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. సర్వే నెం.329లో గతంలో ఇంటి స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. అవి కార్యరూపం దాల్చలేదని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ అర్హులకు ఇంటిస్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఏఐటీయూసీ

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం శ్రీ బాలాజీ లారీ లోడింగ్ అన్‌లోడింగ్ హమాలి వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పుత్తూరు అంబేడ్కర్ భవన్‌లో పి.వెంకటముని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు డి.మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ హమాలి కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హమాలికలు సంక్షేమ ఉపాధ్యాయ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులుగా ఓ.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి పి.ముని రత్నం, కోశాధికారి గంగాధరం, గౌరవాధ్యక్షులు డి.మహేష్, ఉపాధ్యక్షులు పి.కులవర్ధన్, సహాయ కార్యదర్శి కె.సుధాకర్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సొరకాయలు, బాలాజీ, చంద్ర, బాబు, హరి, తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## *రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం : ఎంపీడీవో*

సత్యవేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: బీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన బీసీ, బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపుకు సంబంధించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో స్థిర నివాసం కలిగి అర్హులైన వారందరూ ఫిబ్రవరి 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంకా పూర్తి వివరాల కోసం ఎంపీడీవోకార్యాలయ అధికారులను సంప్రదించాలని ఎంపీడీవో వివరించారు.

## కబ్జా భూములపై విచారణ



సత్యవేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: సత్యవేడు మండలం కొత్తమారి కుప్పంలో ఆక్రమిత భూములపై సమగ్ర విచారణ చేయకపోతే నిరసనకు దిగుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి హెచ్చరించారు. సోమవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్‌తో కలిసి ఆయన కొత్తమారికుప్పంలో ఆక్రమిత భూములను పరిశీలించారు. మురళి మాట్లాడుతూ కొత్తమారికుప్పం రెవెన్యూలో కొందరు పెత్తందారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్టు ఆరోపించారు. పేదలకు చెందాల్సిన భూములు బడా బాబుల గుప్పిట్లో ఉందన్నారు. సర్వే నెం.300 నుంచి 386 వరకు దాదాపు 300 ఎకరాలు ఇక్కడ ప్రభుత్వ భూములు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నరెవెన్యూ అధికారులు చోద్యం చూడడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైగా స్థానికేతరులు కొందరు రెవెన్యూ అధికారులకు లక్షలాది రూపాయలు ముట్టచెప్పి పట్టాలు లేకపోయినా ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదు చేయించుకుని పట్టాదారు పాసు పుస్తకాలు పొందినట్టు చెప్పారు. ఆక్రమిత భూముల్లో ప్రస్తుతం మామిడి చెట్లు తగిలం చెట్లు పెంచుకుంటున్నారని గుర్తు చేశారు. అయితే అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు భూములు పంచాలని కోరినా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. ఆక్రమిత భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని ఇటీవల జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసే కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, దీన, గోవిందరాజు, పురుషోత్తం, చెన్నయ్య, స్వప్న, శేఖర్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన వాహనాలకు కళ్లెం వేయండి

పాకాల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : మండలం పరిధిలో కాలం చెల్లిన వాహనా లను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి రోడ్డు పైకి అనుమతించారాదు అని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి వేంకటాద్రి నాయుడు రవాణా శాఖ విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలో కాలుష్యం వాహనాలు వల్ల తీవ్రంగా పెరిగిపోతూ ఉండడం సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు రోడ్డుపై హల్చల్ చేస్తూ ఉండడం ఏమైనా అనుకోని ప్రమాదాలు సంభవిస్తే ఈ బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని కాళం చెల్లిని వాహనాలకు కళ్లెం వేసే దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

## గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్



పాకాల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: పాకాల మీదుగా గంజాయి తరలిస్తున్న ముఠాను అరెస్టు చేసి వారి నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పాకాల సిఐ సుదర్శన్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం ఉదయం నెల్లూరు రూరల్ మండలం అల్లిపురం గ్రామం మేకల వారి తోటకు చెందినసానా విష్ణుమోహన్‌రెడ్డి (24), అలాగే తమిళనాడు రాష్ట్రం, తేని జిల్లా ఉత్తమ పాలెం తాలూకా కంభం గ్రామం దేవర వీధికి చెందిన పాండియన్ (31) గంజాయిని విజయవాడ నుండి మధురైకి తీసుకుని పోవుటకు పాకాల రైల్వేస్టేషన్‌లో ఉన్నారనే సమాచారంతో పోలీసు సిబ్బంది వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 13కేజీల గంజాయిని మరియు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం పాకాల కోర్టుకు పంపడం జరిగిందని సీఐ సుదర్శన్ ప్రసాద్ తెలిపారు. మధురైకి ట్రైన్ లేదని కాట్పాడికి వెళ్లి అక్కడి నుంచి మధురైకి వెళ్లాలని వారు పాకాల రైల్వేస్టేషన్‌లో ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో పాకాల

## ఆగమోక్తంగా వార్షిక విశేషపూజ



తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి: అభిషేకప్రియుడు... శ్రీనివాసుడి ఉత్సవ మూర్తులు మలయప్పస్వామి ఉభయదేవేరులకు వైఖానస ఆగమోక్తంగా వసంతపంచన తొలిసారిగా వార్షిక విశేషపూజ నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలోపల కల్యాణోత్సవమండపంలో ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామికి విశేషపూజ, స్నపన తిరుమంజనం జరిపించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## బ్లూమింగ్ బడ్స్‌లో అక్షరాభ్యాస పండుగ



చంద్రగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో సోమవారం చిన్నారుల అక్షరాభ్యాస పండుగ ఘనంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. వేదపండితులు దీక్షతులు శివకుమార్ సరస్వతి దేవి అమ్మవారి ఉపాసన గావించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి అమ్మవారి ఆశీసులతో తలిదండ్రులు తమ పిల్లలచే అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలకు పలక, బలపాలు, పుస్తకం, పెన్సిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి.హితేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్సీ మానిటరింగ్ కమిటీ మీటింగ్‌పై వినతి



చంద్రగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ఎస్సీ మానిటరింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించాలని కోరుతూ టిడిపి ఎస్సీ నాయకులు సోమవారం తహశీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత నెల 29న ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఎస్సీలు సమావేశం నిర్వహించుకున్నట్లు వివరించారు. ప్రతి నెలా ఎస్సీ మానిటరింగ్ కమిటీ మిటింగ్ నిర్వహించడం ద్వారా దళితుల సమస్యలకు పరిష్కారం లభించగలదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల నాయకుడు శంకర్, మాజీ జడ్పీటిసి అమ్ములు నాగరాజు, మాజీ సర్పంచ్‌లు మనోహర్, బాలసుబ్రమణ్యం, వెంకటమునెయ్య, అంకాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బి.ఫార్మసీ కోర్స్ నందు స్పాట్ అడ్మిషన్స్

తిరుపతి విద్య, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయములో బి. ఫార్మసీ కోర్సులో చేరదలచిన వారికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ఎస్వియు రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతినాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రవేశ ప్రక్రియ కొరకు ఈ.ఏ.పి సెట్ 2024లో అర్హత సాధించి ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందనీ డి ఓ ఏ డైరెక్టర్ ఆచార్య ఊకా రమేష్ బాబు తెలిపారు. ఈ కోర్స్ లో చేరదలచిన విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 5వ తేదీ బుధవారం ఉదయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ నందు హాజరుకావాలనీ, అదేవిధంగా ఈ అడ్మిషన్ల లో ప్రవేశం పొందిన వారికి ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యము ఉండదనీ డైరెక్టర్ తెలిపారు.

## ఎస్వీయూ అష్ట దిగ్బంధం...నేడూ వర్సిటీ సెలవే!



తిరుపతివిద్య, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ఎస్వీయూను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో వేల సంఖ్యలో పోలీసులు వర్సిటీలో ఉదయం నుంచే హల్చల్ చేశారు. వర్సిటీ పరిపాలనా భవనానికి వెళ్లే అన్ని దారులలో భారీకేడ్లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పోలీసుల గస్తీ ఏర్పాటు చేశారు. వర్సిటీలో ఎటుచూసిన పోలీసుల బూట్ల చప్పుడతో దద్దరిల్లింది. వర్సిటీలో సార్వత్రిక ఎన్నికలను తలపించేలా పోలీసులు పెద్ద సంఖ్యలో చక్కర్లు కొట్టడం, పోలీసు వాహనాల హారన్ల మోతతో వర్సిటీలో కర్ఫ్యూను తలపించింది. వర్సిటీకి అధికారులు సోమవారం సెలవు ప్రకటించారు. వర్సిటీ ఆవరణలోని మెన్, ఉమెన్ హాస్టల్స్ లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. బయటకు వెళ్లిన విద్యార్థులను వర్సిటీలోనికి అనుమతించక పోవడంతో విద్యార్థులు రోడ్లపైనే పడిగాపులు కాశారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారానికి వాయిదా పడటంతో మళ్లీ వర్సిటీలో పోలీసుల హల్చల్‌ను భరించాల్సిందేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్ వి ఆర్ట్స్ కళాశాలలో వసంత పంచమి వేడుకలు



తిరుపతి విద్య,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: స్థానిక బాలాజీ కాలనీలో ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యాక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించి విద్యార్థులు క్రమశిక్షణతో, దైవ భక్తితో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. గరికపాటి రమేష్‌బాబు ముఖ్య వక్తగా విచ్చేసి వసంత పంచమి విశిష్టత వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భాస్కరుడు, అధ్యాపకులు భీమన్న, లోకనాధ మండడి, వెంకటేశ్వర్లు, ప్రసాద రావు, తేజోవాణి, మునస్వామి ఆచారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సొక్రటిస్‌లో వసంత పంచమి వేడుకలు



తిరుపతి విద్య,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : సొక్రటిస్ ఐకాన్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలు వేసిన అనంతరం నూతనంగా చేరిన పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ కె.ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ సరస్వతి మాత పుట్టినరోజున విద్యార్థులు అక్షర స్వీకారం పొందినచో వారికి జ్ఞానం మేధస్సు,శక్తి కలిగి జీవితంలో గొప్పవారుగా అవుతారని అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో వసంత పంచమి

తిరుపతి విద్య, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో ఉదయ మాణిక్యం నందు వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతి దేవి పూజ వేడుకలు ప్రిన్సిపల్ కె.రేష్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ప్రిన్సిపల్‌ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు

## రథసప్తమి వేడుకల సర్వం సిద్ధం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: తుమ్మలగుంట వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం రథసప్తమి వేడుకలకు ముస్తాబయింది. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం నుంచి సప్త వాహనాలు (ఏడు వాహనాలు)పై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ముందుగా శ్రీకల్యాణ వెంకన్న సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేయనున్నారు. ఆ తర్వాత వరుసగా చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తుకు దర్శనం ఇస్తారు. ఏర్పాట్లును ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## శ్రీసాయి సుధా స్కూల్లో అక్షరాభ్యాసం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: తల్లి ఒడి నుంచి బడి గుడిలోకి వెళ్లే ప్రక్రియే అక్షరాభ్యాసం అని శ్రీసాయిసుధా ఇంగ్లీషు మీడియం హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. మంగళవారం వసంత పంచమిని పురస్కరించుకుని తిరుపతిరూరల్ నలందనగర్‌లోని శ్రీసాయిసుధా ఇంగ్లీషు మీడియం స్కూల్లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వసంత పంచమినాడు సరస్వతి అమ్మవారి కటాక్షిస్తూ బీజాక్షరాలు దిద్దడం మూలంగా విద్యాభ్యాసాన్ని ప్రారంభించడం సంప్రదాయమని తెలిపారు. తల్లి ఒడిలో నుంచి చదువుల తల్లి ఒడిలోకి చేరే ఈ అక్షరాభ్యాస కార్యక్రమం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం పిల్లలకు పలక, బలపం, పుస్తకాలు, పెన్నులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లు, పుష్ప, శారద, వినీత, రాధ, రేవతి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఓంకారజ్యోతిర్లింగేశ్వరస్వామి

## మహాశివరాత్రి గోడపత్రిక ఆవిష్కరణ

### -భక్తులకు సకల సౌకర్యాలు గుండాల గోపీనాథ్



తిరుపతి,ఫిబ్రవరి2ప్రభాతవార్త : రేణిగుంటలోని వెదుళ్ళ చెరువు గ్రామంలోని శ్రీఓంకార జ్యోతిలింగేశ్వ స్వామి దేవాలయంలో సోమవారం మహాశివరాత్రి వేడులక గోడపత్రికను ఆలయ ఆవరణంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ,ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగవైభవంగా జరుగుతుందని, పర్వదినంరోజున ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణయ్య స్వామి, ఆలయ సభ్యులు చంద్రశేఖర్ స్వామి, కొండెచెంగారెడ్డి, తొండమనాడు సుబ్రమణ్యంరెడ్డి, పురోహితులు సురేష్ , ఫణీభూషణ్ రెడ్డి జ్యోతిభాస్కర్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

### దేవునిపై అచంచల భక్తి విశ్వాసం

## ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు రూ. 50 లక్షల విరాళం

### -దాత మోహనను అభినందించిన అదనపు ఈవో



తిరుమల,ఫిబ్రవరి2 ప్రభాతవార్తప్రతినిధి: భారత్‌సహా పలుదేశాల్లో విపత్తు అధికారిగా సేవలు అందించిన మోహన అనే మహిళ తన జీవితంలో ప్రతిపైసాను ఆదాచేసి వెంకన్నకు విరాళంగా అందించింది.దాత మోహన ఆదాచేసిన రూ.50 లక్షల ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు సోమవారం టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ విరాళాన్ని టిటిడి విద్యా సంస్థలలో చదువుతున్నఅనాథ, పేద పిల్లల సంక్షేమం కోసం వినియోగిం చనున్నారు. రేణిగుంటకు చెందిన ఈమె భారతదేశంతోపాటు కాసావో, అల్బేనియా, యెమెన్, సౌదీఅదేబియాలలో అభివృద్ధి విపత్తు నిర్వహణ రంగాలలో వివిధ హోదాల్లో పనిచేశారు. మూడున్నర దశాబ్దాలకుపైగా తన వృత్తి జీవితంలో సంపాదించిన ధనాన్ని, గోవిందుడి కృపతో అనాథలకు,పేదలకు ఉపయోగపడాలనే ఆమె నిర్ణయం అభినందనీయమని అదనపు ఈవో ప్రశంసించారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో వెబినార్



తొట్టంబేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో సోమవారం స్ట్రాటజీస్ టు ఎన్ హ్యాన్స్ రీసెర్చ్ ప్రొడక్టవిటీ అనే అంశంపై తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ పి.కుమారి నీరజ కన్వీనర్, కో కన్వీనర్ వికె.దీన దయాల్, డాక్టర్ టి.మాలతి గేబ్రియల్, టి.శైలజ, డాక్టర్ సి.సాయి వందనల ఆధ్వర్యంలో వెమినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో రీసోర్స్ పర్సన్‌గా డాక్టర్ జి.స్వాతి, లెక్చరల్ ఇన్ జువాలజీ, నగరి, మరియు డాక్టర్ టి.జీవన్‌కుమార్ లెక్చరల్ ఇన్ ఇంగ్లీష్ అనంతపురంకు చెందిన వారు విచ్చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వికె.దీనదయాల్, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మాలతిగ్రేబియల్, డాక్టర్ యం.ఉషారాణి, సుమతి, జమీల, అనూజ, కుమారి సాహితి, శివశంకర్ నారాయణ, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి,నరసింహరావు పాల్గొన్నారు.

## అంగ వికలాంగుల పింఛన్ల తనిఖీ

సత్యవేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో అంగ వికలాంగులకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల తనిఖీ ప్రారంభమైంది. అర్హత లేని వ్యక్తులు కూడా పింఛన్ పొందుతున్నారని వచ్చిన ఆరో పణల నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై సమీక్ష చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే పెరాలసిస్, డయాలసిస్‌కు సంబంధించిన పింఛన్లను పరిశీలించారు. సోమవారం సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో ఎంపీడీవో చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ పర్యవేక్షణలో శ్రీకాళహస్తి వైద్యుడు జయగోపాల్ అంగ వికలాంగుల పింఛన్ల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలన ప్రక్రియలో రోజుకు సుమారు 50 మంది అంగ వికలాంగులను వైద్యులు శారీరకంగా పరీక్షించి, వారి అంగ వైకల్యం స్థాయిని నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ హేమలత, డిజిటల్ అసిస్టెంట్ మొరాజీ సాయి, ఇతర అధికారులు, అంగ వికలాంగులు పాల్గొన్నారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II**

**1st Floor, Triveni Complex, Abids, AT : Hyderabad**

**O.A.No. 496 OF 2024**

BETWEEN :
HDFC BANK LIMITED ... Applicant

AND

M/s. CHALAPATHI INDUSTRIES AND ANOTHER ... Defendant(s)

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,

1. **Mrs. Kapagunta Annapurna, W/o. K.V. Chalapathi,** Aged about 53 Years, OCc : Business, D.No.1037, Harinivasam, Opp : Sri Vari Sannidhi, Siva Jyothi Nagar, Tirupathi, Chittoor District-517501, Andhra Pradesh.
   Also at : Mrs. Kapagunta Annapurna, W/o. K.V. Chalapathi, Aged about 53 Years, Occ : Business, R/o. Door No.6-1-201, 1st Floor, Varadaraja Nagar, Tirupathi Town, Chittoor District-517501, Andhra Pradesh. - Defendant No.3
   ... Defendants

Please take the summons in the above O.A.No.496 of 2024 filed by the Applicant for Recovery of money of Rs.27,10,358.71 Ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"Vaartha" Telugu Daily, Chittoor District Edition** newspaper and posted the matter to **13.03.2025.**

In accordance with sub-section (4) of section 19 of the Act, You, the Defendants are directed as under :-

(i) To show cause within thirty days of the Service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties:
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **13.03.2025 at 10.30 a.m at Debts Recovery Tribunal-II,** 1st floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence.

**Given under my hand and the seal of this Tribunal on this day 18th day of January, 2025**

**(By order of the Court)**

**Asst Registrar**
**Debts Recovery Tribunal-II**
**Hyderabad.**

# టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తాం

**- చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్**



వెంకటగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల పనులను ఈ సంవత్సరం ఆఖరికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని ఆ సంస్థ చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ తెలిపారు. వెంకటగిరి లోని కిడ్కో గృహాల లబ్ధిదారులతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ముఖాముఖి నిర్వహించారు. లబ్ధిదారులు కట్టవలసిన బాకాయిలను ప్రభుత్వమే చెల్లిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, ఈ ఎంఐలను ప్రభుత్వమే చెల్లించే విధంగా నిర్ణయించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం టిడ్కో గృహాలను పనులు చేయక నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ గృహాలను లబ్ధిదారులకు ఇస్తే చంద్రబాబు నాయుడుకి పేరు వస్తుందని కట్టకుండా శిథిలావస్థకు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర మొత్తం మీద అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న గృహాలను అర్హులైన వారికి అందజేస్తామని అన్నారు. గృహాల సముదాయంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. లబ్ధిదారులు చెప్పిన పది సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీధి దీపాలు వెలగడం లేదని, ఆకతాయిలా ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని లబ్ధిదారుతెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడు తూ పేదవాని సొంత ఇంటికలను సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చుతాడని తెలిపారు. లబ్ధిదారులు డబ్బులు కట్టి తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ నూనె మల్లికార్జున యాదవ్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, జనసేన నాయకులు జంపాల ప్రకాష్, కృష్ణయ్య, సునీల్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి



కోట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : దేశానికి అన్నం పెట్టే అన్నదాతను ఆదుకోవాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వకపోవడం బాధాకరమ న్నారు. ప్రస్తుతం డెల్టా ప్రాంతంలో వరికోతలు ప్రారంభమయ్యాయని చెప్పారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర 19,550 రూపాయలు ఉండగా, బిపిటి రకం ధాన్యం పుట్టి రూ.16 వేలకే అమ్ముకుంటున్నారని చెప్పారు. వ్యవసాయానికి అధిక పెట్టుబడులు పెట్టి రైతులు ఇబ్బందుల పాలయ్యారని చెప్పారు. కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.

## అసంపూర్తి సమస్యలపై స్పందించండి : జనసేన



గూడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : కోట మండలంలోని గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నదిపై వంతెన నిర్మించాలనీ, అలాగే పట్టణంలో జాతీయ రహదారికి అనుసంధానంగా పంబలేరువంతెన పనులు అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నాయని వాటిపై దృష్టి సారించి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు చేపట్టాలని ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కూటమి ఎంఎల్ఏ సునీల్ కుమార్‌ను కోరారు. గూడలి సమీపంలోని రుద్రవరం గ్రామంలోని విద్యార్థులు దగ్గరలో ఉన్న మెట్టు గ్రామంలోని పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో స్వర్ణముఖి నదిలోని ఏటి నుంచి నడిచి వెళ్తున్నారు. ఏటిలో నీరు ఉన్నపుడు విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లేందుకు ఆ ఏరు దాటిస్తు ప్రమాదకరమైన పరిస్థితుల్లో వెళ్తున్నారని ఆ ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనీ కోరారు. అలాగే చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో ఇప్పటివరకు ప్లే గ్రౌండ్ లేకపోవడం వల్ల యువత, విద్యార్థులు క్రీడల్లో వెనకబడి పోతున్నారు స్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పాఠశాలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గూడూరు నియోజకవర్గం పీఓసీ కె.మోహన్, సాయి, సనత్ చిట్టమూరు నాయకులు రాజా, శంకర్, చిల్లకూరు నాయకులు కార్తీక్, రమేష్, మనీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలి

కోట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ఈ నెల 10వ తేదిన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు ఆల్‌బెండజోల్ 400 ఎంజి టాబ్లెట్ అందిస్తారని తెలిపారు. నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనతను తగ్గించి విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ముఖ్య ఉద్దేశమన్నారు.

## వేనాడు దీవికి రోడ్డు వేయండి సారూ

**- ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కోరిన తడ నేతలు**

తడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ఇటీవల వర్షాలకు బాగా దెబ్బతిన్న తడ మండలం వేనాడు దీవికి పటిష్టమైన రోడ్డు నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. సోమ వారం ఆమె తడ మండలంలోని కొందరు టిడిపి నాయకులతో కలిసి కలెక్టర్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సూళ్లూరుపేట-శ్రీహరికోట మార్గంలోని అటకానితిప్ప నుంచి వేనాడు దీవిలోని పల్లిపేట కుప్పంకు 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉందని, గ్రామస్థులు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అక్కడి చారిత్రక దర్గాకు ప్రధాన గ్రామం నుంచి మరో రెండు కిలోమీటర్లు రోడ్డు కావాలని కూడా కోరారు. తడ మండలం భీములవారిపాలెం, ఇరకం దీవిలకు ఇప్పటికీ పడవ ప్రయాణమే ఉంది కాబట్టి అక్కడ రెండు పడవల రేవుల్లోనూ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్లాట్‌ఫారం నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా బివిపాలెం పడవల రేవుకు వచ్చిన కలెక్టర్‌కు ఈ సమస్య గురించి తెలియజేశామని నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారితో ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు బొమ్మన్ పళణి, కొళవి సెల్వం, ఎం.సుదర్శన్‌రావు, చిట్టేటి మునీంద్రయ్య, కళానిధి తదితరులు ఉన్నారు.

## శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో తల చిత్ర ట్రైలర్ విడుదల



తిరుపతి విద్య, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : తొలి అడుగు తిరుపతి నుండి ప్రారంభిస్తున్నామని.. నా కొడుకు అమ్మ రాగినిరాజ్ నటించిన తొలి చిత్రం "తల" విజయవంతం చేయాలని కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ కోరారు. తిరుపతి శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల లో సోమవారం తల చిత్ర ప్రమోషన్స్ ను, ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత సినిమా ప్రమోషన్ రావడం సంతోషంగా ఉందన్నారు. సినిమా ఫిబ్రవరి 14న వ్యాలెంటైన్ డే సందర్భంగా విడుదల అవుతుందన్నారు. అమ్మ మీద ప్రేమ చూపించే కొడుకు పాత్రలో చాలా బాగా ఉందని అన్నారు. హీరో మాట్లాడుతూ తిరుపతి నుండి నా సినిమా ప్రమోషన్ ప్రారంభించడం ఆనందంగా ఉందని,కుటుంబ కథా చిత్రాన్ని అందరూ ఆదరించారని కోరారు. కళాశాల యువతీ యువకులతో నృత్యాలు చేస్తూ, సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు

కోట,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : వసంత పంచమిని పురస్కరించుకుని కోటలోని సోమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జామున అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం చేపట్టి, పుస్తకాలు పలకులు, పెన్నులు ఏర్పాటు చేసి సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని అలంకరించారు. సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి అంకరణ భక్తులను ఆకట్టుకుంది.

## సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోండి

బాలాయపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : 2024-25 వ సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాల కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరి సమావేశం నిర్వహించారు. ఈనెల 7వ తేదీ లోపవు ఎస్సీ, బీసీ, ఓసీలు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## టిడ్కో గృహాల సమస్యలను పరిష్కరించండి

**- చైర్మన్ అజయ్ కుమార్ కోరిన, ఎమ్మెల్యే రామకృష్ణ.**



వెంకటగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : టిడ్కో గృహాల సముదాయంలో ఉన్న సమస్యలను పరిష్కరించా లని ఆ సంస్థ చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం కూడా అందజేశారు. టిట్కో గృహాల వద్ద ప్రతిరోజు మున్సిపాలిటీ వారు శుభ్రపరచాలని, పింఛలను ఇంటి వద్దకే చేర్చాలని, తాగునీరు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లబ్ధిదారులు డబ్బులు కట్టి ఇంకా ఇల్లు తీసుకోకుండా ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చైర్మన్ ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు.

## నాగేంద్రబాబు కలసిన జనసేన నాయకులు



గూడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుని తిరుపతి జిల్లా జనసేన నాయకులు నయీమ్ కలిసారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో మొదటి బహిరంగ సభ చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గంలోని పులిచర్ల మండలం, సోమల గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగేంద్ర బాబు విచ్చేయడంతో, గూడూరు నియోజకవర్గం జనసేన నాయకులు, చిరంజీవి యువత అధ్యక్షులు నయీమ్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

## రేస్ స్కూల్‌లో అక్షరాభ్యాస కార్యక్రమం



చిల్లకూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ప్రతి సంవత్సరం రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చింతవరంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమము కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్యచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుమ్మడి వెంకటసుబ్బయ్య, కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య, వేదపండితులు, పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## వరల్డ్ రికార్డ్ సాధించిన వసంతలక్ష్మికి సన్మానం



గూడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం యోగసమకోణాసనంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సిహెచ్. వసంత లక్ష్మిని, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాశం కుమార్, వారి సతీమణి సంధ్యారాణి, పెన్వర్ ప్రొడక్ట్ లిమిటెడ్ డైరెక్టర్ గంటా మధు కృష్ణ, గాయత్రిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, గుండాల భారతి, కోడిపర్తి కల్పన, దాసరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ



గూడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్‌లు డిమాండ్ చేశారు. గూడూరు నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో అర్హులైన వారిని గుర్తించి, దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అందులో భాగంగా గూడూరు మండల పరిధిలోని విందూరు, రామలింగ పురం కండ్రిగలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు లేని పేదలకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా, ఏ.ఐ.టి.యు.సి నియోజకవర్గ అధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య, వెంకటయ్య, రాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం



గూడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : గూడూరులోని రెండవ పట్టణ పరిధిలో ఉన్న శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ నవకోటి నాయుడు ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. అనంతరం పిల్లలకు పలక, బలపం, పుస్తకం, పెన్సిల్ మొదలైనవి బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ నవకోటి నాయుడు, అకాడమిక్ డీన్ సునీల్ రాజ్, అకాడమిక్ కో ఆర్డినేటర్ హరికృష్ణ, ప్రైమరీ ఇన్‌చార్జ్ సింధు, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు మరియు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే



నాయుడుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: సూళ్ళూరుపేట నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లాకలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లడుతూ నాయుడుపేట పట్టణంలో దర్గాను నిర్మించడంతో పాటు ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా ఎస్సీ,ఎస్టీకాలనీలో సిమెంటురోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు జిల్లాకలెక్టర్ సానుకూలంగా స్పందించి నియోజకవర్గ సమస్యలు పరిష్కరానికి కృషిచేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆమె వెంట టిడిపి నాయకులు నెలవల రాజేష్, నాయుడుపేట మున్సిపాల్టి వైస్‌చేర్మెన్ 786రఫీ తదితరులు ఉన్నారు.

## వత్రపాలెంకు శాశ్వత పరిష్కారం చూపండి : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వత్రపాలెం సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను స్థానిక నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా కాళంగి నది, పాముల కాలువలు పొంగి ప్రవహిస్తే వత్రపాలెం తరచూ ముంపునకు గురవుతుందని, దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.నాయుడుపేట పట్టణంలో ఈద్గాను నిర్మించడంతో పాటు ఆటో నగర్‌ను ఏర్పాటు చేయాలని ఆమె విన్నవించారు. ఈ కార్యక్రమంలో నెలవల రాజేష్, 786 రఫీ, బొమ్మన్ పళణి, సెల్వం, సుదర్శన్, అంకయ్య మునీంద్రయ్య, కళానిధి తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు అంతరాష్ట్ర టువీలర్ దొంగలు అరెస్ట్



కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతంలో టువీలర్ల దొంగతనాలకు పాల్పడే నలుగురు అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. జనవరి 28, 30 తేదీల్లో శాంతిపురం మండలంలో వరుస మోటారు సైకిళ్ల చోరీకి గురైనట్లు ఫిర్యా దులు వచ్చాయన్నారు. దీంతో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, డిఎస్పీ పార్థసారథి ఆదేశాల తో తనతో పాటు కుప్పం అర్బన్ సిఐ శంకరయ్య, ఎస్సైలు నరేష్, శ్రీనివాసులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తు ప్రారంభించామన్నారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం ఎస్సైలు వాహనాలను శాంతిపురం మండలం శిలామాకులరాయి వద్ద తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు టువీలర్లలో వస్తూ పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారన్నారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా వారు కుప్పం టౌన్‌తో పాటు పలు ప్రాంతాల్లో చేసిన చోరీలను అంగీకరించారన్నారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా పంజాలి ఊరుకు చెందిన సికందర్ (27), లక్ష్మీపురంకు చెందిన సేటు (20), శూలగిరికి చెందిన యారబ్ (20), కందికుప్పంకు చెందిన సాదుల్లా (19)లను అరెస్ట్ చేశామన్నారు. వారినుంచి తొమ్మిది లక్షల విలువ చేసే తొమ్మిది వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు ఛేదించిన పోలీసు అధికారుల బృందానికి జిల్లా ఎస్పీ అభినందించారు.

## శివయ్య సన్నిధిలో అక్షరాభ్యాసం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమా లను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం లోని మృత్యుంజయ స్వామి ఆలయం ఎదురుగా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు పట్టణంలోని నలు మూలల నుంచి విశేష సంఖ్యలో తల్లిదండ్రులు తమ బిడ్డలతో హాజరయ్యారు. ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి సూచనలతో డెప్యూటీ ఇఒ ఎన్. ఆర్.కృష్ణారెడ్డి, ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనరెడ్డి, సిఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలోని గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తే మంచిదనే అభిప్రాయం ఉంది. శాస్త్రోక్తంగా చిన్నారుల చేత ఓ,న,మః అక్షరాలను దిద్దించారు. పాల్గొన్న వందలాది మంది తల్లిదండ్రులకు స్వామి అమ్మవార్ల ఆలయంలో దర్శనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు : ఎంవిఐ



పుత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని మోటారు వాహనాల తనిఖీ అధికారి పి.చంద్రశేఖర్ తెలిపారు. గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ రవాణా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారిభద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని జ్ఞానజ్యోతి పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అలాగే కార్లు తదితర భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. అతి వేగం ప్రమాదకరమని పేర్కొన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సురేంద్రనాయుడు మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నివారించడంలో సాంకేతిక పాత్ర కోసం వివరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను చాలా వరకూ నివారించవచ్చని తెలిపారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జ్ఞానజ్యోతి విద్యా సంస్థల కరస్పాండెంట్ హరనాథ్‌రెడ్డి, రవాణా కానిస్టేబుల్ ఇ.నరేంద్రబాబు, డిబిఐకె మహేష్‌లు పాల్గొన్నారు.

## షాక్ కొడుతున్న కరెంట్ బిల్లులు




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంట్ ఛార్జీల పెంపు ప్రసక్తే లేదని తేల్చి చెప్పిన నాయకులు తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీలుగా నిలిచిపోయాయి. కేవలం అధికారం కోసమే వాగ్దానాలు అన్నట్లు కరెంట్ బిల్లులు చెబుతున్నాయి. ప్రతిపక్షంలో వున్నప్పుడు సామాన్యుని నడ్డివిరిచేలా కరెంట్ బిల్లులు పెంచుకుంటూ అధికార ప్రభుత్వం పోతుందని ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు నేడు దాన్ని విస్మరించడం బాధాకరమని సామాన్యులు చర్చించుకుంటున్నారు.గతంలో అధికారంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు చేసిన అప్పుల కారణంగా నేడు కరెంట్ బిల్లులు పెంచుతున్నామని చెప్పిన గత ప్రభుత్వం 36 నెలలు ఫిక్సిడ్ ఛార్జీలు, సర్‌చార్జీలు, ఎఫ్ఎఫ్ఎస్‌పి చార్జీలు అంటూ వాడకం కన్నా అధికంగా ఇవే వుండడం సామాన్యుడు ఔరా అని చర్చించుకుంటున్నారు. డిసెంబర్ నెలలో తీసుకున్న మీటరుకు కూడా నేడు సర్‌చార్జీలు విధించడం విస్మయానికి గురి చేస్తుంది. మరి ఈ సర్‌చార్జీలు ఎప్పటి వరకు కట్టాలి? ఎందుకు కట్టాలి? అని ప్రశ్నించే దిక్కులేకుండా పోయింది. దేశంలోనే అధిక తీరప్రాంతం వున్న మన రాష్ట్రం సొంతముగా కరెంట్ ఉత్పత్తి చేయడంపై దృష్టిసారించాలి, విజన్ వున్న నాయకుడు రాష్ట్రముఖ్యమంత్రి అయితే కరెంట్ ఉత్పత్తి మీద దృష్టాసారిస్తారని భావించిన సామాన్యుడు నేటి ప్రతిపాదనలు ముక్కు వేలేసుకొనేలా చేస్తున్నాయి. మన రాష్ట్రంలో వున్న కరెంట్ చార్జీలు దేశంలో ఎక్కడా లేదని, అదే రాష్ట్ర రాజకీయమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## శ్రీకాళహస్తిలోని టిడ్కో అవినీతిపై విచారణ జరుపుతాం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన ఇళ్ళను వైకాపా పాలకులు రంగులుమార్చి లబ్దిదారులను ఏమార్చి తమ అనుయాయులకు రిజిస్ట్రేషన్ చేసారని కార్పొరేషన్ చైర్మెన్ వేముల పాటిఅజయ్ ప్రకటించారు. సోమవారం ఆయన శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ సమీపంలో 2016-19లో నిర్మించిన టిడ్కోగృహాలకు సంబంధించి పరిశీలించారు. ఈ సందర్బంగా టిడ్కో ఇంజనీర్ల బృందంతో కలసి ఇళ్ళ స్థితి గతులను పరిశీలించారు. ఇక్కడ ఎన్ని ఇళ్ళు నిర్మించారు. ఎన్ని లోనింగ్ చేసారు? మూడు వందల చదరపు అడుగుల ఇళ్ళు ఎన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఇవి పూర్తి చేసి లబ్దిదారులకుఅ ందించుటకు నిధులు ఎంత అవసరమనే అంశాలను సంబంధిత అధికారులతో చర్చించారు. త్వరలో టిడ్కో ఇళ్ళను పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ కల్లా అందించుటకు పరిశీలిస్తున్నట్లు చైర్మెన్ అజయ్ వివరించారు. ఈ సందర్బంగా ఇక్కడ హాజరైన లబ్దిదారులతో కార్పొరేషన్ చైర్మెన్ అజయ్ ప్రత్యక్షంగా చర్చించారు. సొమ్ములు చెల్లించిన లబ్దిదారులు తమను మభ్యపెట్టి ప్రత్యామ్నాయం అంటూ ఇక్కడ కట్టిన డబ్బులను ఇచ్చేస్తామంటూ ఐదేళ్ళు గడిపారని ఎక్కడో పది కిలో మీటర్ల దూరంలో స్థలాలు చూపారని అక్కడ ఇళ్ళు నిర్మించకనే తమను మోసం చేసారని లబ్దిదారులు తమ వెతలను విన్నవించారు. ఎవరూ ఆధైర్యపడవద్దని అందరికి న్యాయం చేయటానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని నిరుపేదల సంక్షేమానికే పెద్ద పీట వేస్తామని చైర్మెన్ వివరించారు. బాధితులు తమపై బ్యాంకులు వత్తిడి తెస్తున్నారని తమకు ఇళ్ళే అందజేయలేదు. రుణాలు చెల్లించమని వత్తిడి తెస్తున్నారని చైర్మెన్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు మాజీ వైస్ చైర్మెన్ మిన్నల్‌రవి వినూత కోట,సాయి,అమర్‌నాథ్,మున్సిపల్ కమిషనర్ బియస్‌గిరికుమార్,టిడ్కో ఇన్‌చార్జి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా శ్రీమహాసరస్వతి యాగం

**-2,500 మంది విద్యార్థులకు పెన్‌లు,ప్యాడ్‌లు, కంకణాలు పంపిణీ**



కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: మాఘ శుద్ధపంచమి (వసంత పంచమి) సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత శ్రీమహాసరస్వతి యాగమును సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. పూతలపట్టు నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈఏడాది 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ఈయాగాన్ని నిర్వహించిస్వామి, అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. ఈమేరకు అలంకరించిన శ్రీసరస్వతీ దేవి అమ్మవారిని మంగళవాయిదా ్యల నడుమ ప్రధాన ఆలయం నుండి స్థాని క ఆస్థాన మండపం వద్దకు తీసుకువచ్చి వుంచి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీమహాసరస్వతియాగంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఈయాగం ఆచరించడం వల్ల కలిగే ఫలితాల గురించి వివరించారు. అనంతరం దేవస్థానం తరపున ఐదు మండలాలకు చెందిన సుమారు 2,500 మంది విద్యార్థులు ఈయాగంలో పాల్గొన్నారు. వారికి దేవస్థానం తరపున పెన్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, అమ్మవారి ముందు పూజల్లో వుంచిన కంకణాలతో పాటు స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా బాసర సరస్వతీ దేవి ఆలయంలో తెలంగాణా ప్రభుత్వం అధికారంగా నిర్వహిస్తున్న అక్షరాభ్యాసం తరహాలో కాణిపాకం ఆలయంలో నిర్వహించేందుకు సీఎంతో చర్చిస్తానని తెలిపారు. అలాగే విద్యార్థులు సరస్వతీ దేవి కటాక్షంతో ఉన్నతస్థాయికి ఎదగాలని, వారి జీవితం బుగపడాలని, వారి ద్వారా సమాజం బాగుపడాలని ఆకాక్షించారు. అలాగే జిలవ్ల కలెక్టర్ సుమిత్‌కుమార్ చరవాణి ద్వారా యాగంలో పాల్గొన్న విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, ఆలయ మాజీ ఛైర్మెన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు విద్యాశాఖ పీఓ వెంకటరమణ, ఐదు మండలాలకు చెందిన ఎంపీఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్తాచాటిన షణ్ముఖ ప్రియ : పరుగు పందెంలో ఛాంపియన్



చంద్రగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో సత్తాచాటిన షణ్ముఖ ప్రియ ఛాంపియన్ షిప్ సాధించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ తెలిపారు. అగరాల వద్ద గల పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం షణ్ముఖ ప్రియను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గత నెల 28 నుండి 30 వరకు విశాఖపట్నంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో 400 మీటర్ల పరుగు పందెంలో, 800 మీటర్ల పరుగు పందెంలోనూ షణ్ముఖ ప్రియ మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా ట్రిపుల్ జంప్ పందెంలో రెండవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వ్యక్తిగత బాలికల విభాగంలో చాంపియన్ షిప్ సాధించినట్లు వెల్లడించారు. ఈ పోటీలలో సాధించిన విజయాలతో షణ్ముఖ ప్రియ సౌత్ జోన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌కు ఎంపికైనట్లు వెళ్లడించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ భక్తవత్సలం, డాక్టర్ పి.నాగేంద్ర, డాక్టర్ టి.నరశింహారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.శంకర్, తదితరులు పాల్గొన్నారు.